క్లుప్తంగా

సన్మానం



మల్హర్: మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి విరమణ పొందిన మల్క భాస్కర్‌రావును తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, పూర్వ విద్యార్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు దంపతులను శాలువాలు, మోమెంటోలతో సత్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. భాస్కర్‌రావు 41 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా నిర్విరామ కృషికి వారి వద్ద నేర్చుకున్న విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరరులు పాల్గొన్నారు.

కళోత్సవ పోటీలు

కాటారం: మహాముత్తారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి కళోత్సవాలు నిర్వహించారు. మండంలోని ప్రభుత్వ, కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి కళోత్సవాలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ సంజీవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి



టేకుమట్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా అధ్యక్షుడు మారెపెల్లి మల్లేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగిన గ్రీవెన్స్ సెల్‌లో తహసీల్దార్ విజయలక్ష్మీకి దరఖాస్తును అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ కేవలం 40శాతం మాత్రమే జరిగిందని, మిగతా రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే ప్రకటించాలని కోరారు. ఆయన వెంట కసరవేని కుమార్, పులి సరోత్తంరెడ్డి, చంద్రగిరి శంకర్, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సోషల్ ఆడిట్

పలిమెల: నాలుగోవ విడత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా నేటి (మంగళవారం) నుంచి ఈనెల 4న వరకు ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ టీం, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, ఈసీ శ్రీకాంత్, తదితరులు హాజరైయ్యారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మొగుళ్లపల్లి: పురుగు మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని రంగాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగాపురం గ్రామానికి చెందిన శ్రీరాం రవి (56) తాగుడుకు బానిసై కుటుంబసభ్యులతో తరుచూ గొడవలు పడుతూ ఉండేవాడు. ఆదివారం మద్యం తాగి తాగిన మత్తులో పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ప్రణిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

అధ్వానంగా బస్టాండ్



బస్టాండ్ ప్రాంగణంలో నిల్వ ఉన్న మురుగు నీరు



బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలు

బస్టాండ్ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, మురుగు కుంటలు

- మురుగుదొడ్ల నిర్వహణ లేక ప్రయాణికుల ఇబ్బందులు

గణపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అరకొర వసుతులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో గతంలో శిథిలావస్థలో ఉన్న బస్టాండ్‌ను తొలగించి 8 సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి నూతన బస్టాండ్‌ను నిర్మించారు. లక్షల రూపాయలతో నిర్మించిన ఈ బస్టాండ్ ప్రయాణికులకు ఉపయోగపడడం లేదు. బస్టాండ్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు గుంతలుగా మారి మురికి నీరు నిల్వ ఉండటంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు కూడా తీవ్రంగా ఉంటుండంతో ప్రయాణికులు బస్సులు వచ్చే వరకు బస్టాండ్‌లో వేచి ఉండలేక బస్సుల కోసం రోడ్డు పైనే వేచి చూస్తున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణ లేక పోవడంతో అపరిశుభ్రంగా ఉండడంతో ప్రయాణికులు మరుగుదొడ్లను వినియోగించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ప్రాంగణములో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, మురుగు నీరు నిల్వ లేకుండా కుంటలను పూడ్చి వేయాలని కోరుతున్నారు. బస్టాండ్ ప్రాంగణములో ఉన్న మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రత్యేకంగా ఒక మనిషిని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

గణపురం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రోజుకు వందలాది మంది ప్రయాణికులు బస్టాండ్‌కు వస్తుంటారు. కానీ ఇక్కడ మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ప్రాంగణం మొత్తం పిచ్చి మొక్కలు, మురగు నీటి కుంటలతో దుర్గంధం వస్తుంది. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైన బస్టాండ్ నిర్వహణకు ప్రత్యేక చొరువ తీసుకోవాలి.

– నారగాని కిషోర్ గౌడ్, గణపురం

మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న బందు సాయిలు

పలిమెల: బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని, దీని ద్వారా దేశాభివృద్ధికి ప్రజా ప్రయోజనాలకు తీరని నష్టం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం మండల ప్రథమ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సూదుల శంకర్ జెండా ఆవిష్కరించారు. అనంతరం బందు సాయిలు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులు, ఆదివాసీలు, కార్మికులు, పేద ప్రజలపై అమానుషమైన దాడులు దౌర్జన్యాలు కొనసాగిస్తూ, హింసను ప్రజలలో ప్రేరేపిస్తుందన్నారు. అటువంటి బీజేపీ విధానాలను తిప్పికొట్టాలని ప్రతినిధులకు సూచించారు. అదే విధంగా బీజేపీ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలల్లో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం రాజేందర్, పార్టీ సభ్యులు ఆత్కూరి శ్రీకాంత్, పాగే పోట్టయ్య, పెద్ద శేఖర్, అనపర్తి బాల్ అక్క, మూసాకి బిలంద్, గుమ్మడి భీమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న ఎస్సై సుధాకర్

భూపాలపల్లి అర్బన్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై సుధాకర్ తెలిపారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలు, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సోమవారం బహుతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి స్థానిక కొమురయ్య భవనంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎస్సై హాజరై విద్యార్థులను అభినందించి మాట్లాడారు. విద్యార్థులు మహనీయుల చరిత్రలను చదవాలని, మంచి సమాజం కోసం పాటుపడాలని సూచించారు. సోషల్ మీడియా కంటే చదువుల్లో పోటిపడి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. స్వాతంత్ర ఉద్యమంలో భగత్‌సింగ్ పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు సోత్కు ప్రవీణ్, క్యాతరాజు సతీష్, జోసెఫ్, శ్రీకాంత్, పవన్, సాకేత్ రెడ్డి, రమేష్‌చారి, శివ, లావణ్య, స్వరూప ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఏవైఏస్ నాయకులు

చిట్యాల: అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భవించి 48 సంవత్సరాలు పూర్తి చేసుకుని 49వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆ సంఘం రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సరిగొమ్ముల రాజేందర్, జన్నే యుగేందర్, కట్కూరి శ్రీనివాస్, పుల్ల ప్రతాప్, కనకం తిరుపతి, గురుకుంట్ల కిరణ్, గుర్రపు తిరుపతి, పర్లపల్లి కుమార్, పాముకుంట్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కాటారం: రాంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పుట్ట మధు

కాటారం: మండలంలోని కొత్తపల్లికి చెందిన కుంభం రాంరెడ్డి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సోమవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేశ్, జోడు శ్రీనివాస్, నరివెద్ది శ్రీనివాస్, జక్కు శ్రావణ్, లక్ష్మయ్య, రమేశ్, బాపురెడ్డి తదితరులు ఉన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన దండు తిరుపతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సోమవారం సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు అరికాంతను అన్నారెడ్డి, బండారి రామస్వామి, కుమార్, మహేందర్, భిక్షపతి, రమేశ్, శ్రీధర్, సాంబయ్య, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎంపీలపై నిందలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న కత్తి సంపత్

టేకుమట్ల: గ్రామాల్లో రోగులకు ప్రాథమిక చికిత్సనందిస్తున్న ఆర్‌ఎంపీలపై కక్షపూరిత నిందలు వేయడం సరికాదని ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అత్యవసర సమయంలో ప్రాథమిక చికిత్సనందిస్తూ ఎంతో మందికి సహాయకారిగా పని చేస్తున్న ఆర్‌ఎంపీలపై పలువురు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పరిమితికి లోబడి వైద్య సేవలను అందిస్తున్న తమపై కావాలనే కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అందుకు నిరసనగా సోమవారం ప్రాథమిక వైద్య సేవలను పూర్తిగా నిలిపి వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్‌ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

భాగిర్థిపేటలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

రేగొండ: మండలంలోని భాగిర్థిపేట గ్రామంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో ఆదివారం శునకాల దాడిలో గాయపడిన బాధితులను సందర్శించి వారికి వ్యాక్సిన్ వేశారు. కుక్క కాటుపై నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి తెలిపారు. కుక్కలు, కోతుల దాడిలో గాయపడితే యాంటీ రాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా జీవించాలి



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న ఆర్ఐ సురేందర్‌రెడ్డి

మొగుళ్లపల్లి: కులాలలకు, మతాలకు అతీతంగా ప్రజలు జీవించాలని ఆర్ఐ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో అంటరానితనం, అమనూషమపై పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలని కులాల పేరుతో ఎవరిని కించపర్చకూడదని అలా చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజ్యాంగం హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతినగర్‌లో మానవ హక్కుల దినోత్సవం



చిట్యాల: మాట్లాడుతున్న ఎస్సై ఎండి.శాఖాన్



టేకుమట్ల: అవగాహన సదస్సులో అధికారులు

చిట్యాల: మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో సంబంధిత అధికారులు మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెకండ్ ఎస్సై ఎండి.శాఖాన్ హాజరై మాట్లాడుతూ.. దళితులను చిన్నచూపు చూడోద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో సోమవారం పౌర హక్కులపై తహసీల్దారు విజయలక్ష్మీ, ఏఎస్సై అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో అందరూ ఒకటేనని, ఎస్సీ, ఎస్టీలను వేరు చేసి, వివక్ష చూపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విజయయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, గందం సురేష్, బట్టల కుమార్, మహిళా కానిస్టేబుల్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



ఫోన్ అందజేస్తున్న ట్రైనీ ఎస్సైలు హేమలత, దివ్య

రేగొండ: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు ట్రైనీ ఎస్సైలు హేమలత, దివ్య సోమవారం పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన దేవేందర్, రేపాకపల్లి గ్రామానికి చెందిన నాయిని కుమార్ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వివరాలు నమోదు చేసి ఫోన్లని గుర్తించి బాధితులకు అందజేశారు. ఎవరైనా సెల్ ఫోన్లు పోగొట్టుకున్న, దొంగతనానికి గురైనా ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, ఈ పోర్టల్ ద్వారా ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని ట్రైనింగ్ ఎస్సైలు సూచించారు.

'బీఆర్‌ఎస్ నాయకులకు ఓటమి భయం'



మాట్లాడుతున్న సత్తమ్మ

కాళేశ్వరం: బీఆర్ఎస్ పార్టీ నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు బందెల సత్తమ్మ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళ సభ్యత్వ నమోదులో బలవంతంగా ఎవరి వద్ద డబ్బులు తీసుకోలేదని, మహిళలే స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో పంపుహౌస్‌లో భూనిర్వాసితుల వద్ద భూములు లాక్కోని, కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. ఆమె వెంట లక్ష్మి, పట్టి రజిత తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు నమోదు ప్రక్రియ ప్రారంభం

భూపాలపల్లి అర్బన్/కాటారం/మొగుళ్లపల్లి: వరంగల్-నల్గొండ-ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థాన ఎన్నిక ఓటర్ నమోదు ప్రక్రియను ప్రారంభించినట్లు భూపాలపల్లి, కాటారం, మొగుళ్లపల్లి తహసీల్దార్లు శ్రీనివాసులు, నాగరాజు, సునీత సోమవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. నవంబర్ 6 వరకు ఓటర్ నమోదు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. నవంబర్ 23 ముసాయిదా ఓటర్ జాబితా విడుదల, 23 నుంచి డిసెంబర్ 9వ తేది వరకు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న ఓటరు తుదిజాబితా ప్రచురణ ఉంటుందన్నారు. టీచర్లు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



భూపాలపల్లి రూరల్: పోషణ మాసం నిర్వహిస్తున్న సిబ్బంది

భూపాలపల్లి రూరల్: గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత సూచించారు. పోషణ మాస ఉత్సవాల సందర్భంగా సోమవారం భూపాలపల్లి పట్టణంలోని కాకతీయ కాలనీ-2 అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ ఉమా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సూపర్‌వైజర్ హాజరయ్యారు. టీచర్లు అనూష, మమత పాల్గొన్నారు.

పలిమెల: గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషణ లోపం లేకుండా జాగ్రత్త వహించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివరాణి సూచించారు. మహదేవ్‌పూర్ ప్రాజెక్ట్ పరిధిలోని పలిమెల సెక్టార్‌లో సోమవారం పోషణ మాసం మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శివరాణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు స్థానికంగా దొరికే కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, ఆకుకూరలు వారి రోజువారి ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజిత,సునీత, కీర్తన, రమ, ఆశ వర్కర్లు కల్పన, సంగీత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ బలోపేతానికి కృషి చేయాలి



కాటారం: వివరాలు వెల్లడిస్తున్న సీఈఓ సతీశ్



మల్హర్: మాట్లాడుతున్న మొండయ్య

కాటారం: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘం చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరికి సంబంధించి అంశాలను సీఈఓ ఎడ్ల సతీశ్ సభలో వివరించారు. పీఏసీఎస్ ఉద్యోగుల రెగ్యూలరైజేషన్, రూ.రెండు లక్షల రుణమాఫీ, లావాణీపట్టా భూములకు రుణాల మంజూరు ప్రతిపాదనలపై పాలకవర్గం చర్చించి, తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, డైరెక్టర్లు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, చీమల సత్యం, జక్కుల అజయ్, ఐలి రాజబాబు, రాజేశ్వరీ, బాసాని హిమాకర్, రైతులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి తోడ్పడాలి

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాడాలని మహాముత్తారం పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంతకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం లావాదేవీలు, ఖర్చులు, లాభాలు, అభివృద్ధి పనులు, తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. రైతులకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్టర్ రాజు, వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డి, డైరెక్టర్లు చిన్నరాజయ్య, వెంకట్‌రెడ్డి, సుజాత, భాస్కర్‌రెడ్డి, సమ్మక్క, రాజయ్య, మల్లమ్మ, రైతులు, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పీఏసీఎస్ చేయూత

మల్హర్: రైతులకు అన్ని రకాల రుణాలు అందించి వారికి పీఏసీఎస్ ద్వారా చేయూతనందిస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య అన్నారు. మండలంలోని తాడిచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం పీఏసీఎస్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొండయ్య మాట్లాడుతూ.. గతంలో పీఏసీఎస్‌లో రుణాలు తీసుకోవాడానికి ఇబ్బందులు పడే వారని నేడు రైతులు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. రైతులుకు రుణాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాలను బలోపేతం చేయడానికి నూతన బైలా తయారు చేసినట్లు తెలిపారు. తద్వార సంఘం మరిన్ని నూతన వ్యాపారాలు చేసుకొనుటకు వెసలుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మల్క సూర్య ప్రకాశ్‌రావు, సంఘ పాలక వర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యులు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.